

31న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - అమలాపురం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జనవరి1, 2026న పంపిణీ చేయాల్సిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఈ నెల డిసెంబర్ 31, 2025 బుధవారం ఒక రోజు ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.దీనికి సంబంధించిన నిధులు రూ. 101.68 కోట్ల సొమ్ము ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, మున్సిపల్ కమిషనర్లు డిసెంబర్ 30న అవసరమైన నగదు ఉపసంహరణకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు తగిన ప్రచారం కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కోరారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సంబంధిత అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు.

అన్నదాతకు అందని పరిహారం

- రబీ సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి
- బీమా ఉన్న వారికే పరిహారం
- కౌలు రైతులకు దొరకని రుణం



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

ప్రజాశక్తి రాజోలు

మాది రైతు కుటుంబం అన్నదాతలకు ఏ కష్టం వచ్చినా ముందుంటాం.. అంటూ ప్రతి సమావేశంలో మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకు చెబుతుంటారు. అయితే క్షేత్ర స్థాయి పరిస్థితులు ఇందుకు భిన్నం. రెండు నెలల క్రిందట వచ్చిన మొంథా, అల్పపీడనం తుపాను ప్రభావంతో వరి సహా ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రెండు నెలలు దాటినా రైతులకు నష్టపరిహారం అందలేదు. నవంబర్ నెలాఖరు కయ ముందే పరిహారం ఇస్తామని చెప్పినా ఆ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా..

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో అపార నష్టం జరిగింది. అప్పుడు వీచిన గాలులు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎక్కడికక్కడ నేలవాలిన పొలాలు, దెబ్బతిన్న ఇళ్లు ఇలా వివిధ సమస్యలతో ప్రజలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందం రావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సాధ్యమైనంత ఎక్కువ సాయం చేస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలో జిల్లాలో 1.61 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరిగితే 73,822 ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని అంచనా. ముఖ్యంగా మొంథా తుపాను రైతులను నట్టేట ముంచింది. కోత దశలో ఉన్న పంట ఎక్కడికక్కడ నేలపాలైంది. చేతికొచ్చే దశలో ఉన్న పంటలకు తీరని నష్టం వాటిల్లింది. తుపాను మిగిల్చిన నష్టం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సాయం చేయాల్సిన ప్రభుత్వం ఆదుకుం టొందా అంటే అదీ లేదు. బయటకు కనబడని నష్టాన్ని గుర్తించడం లేదు. 33 శాతం కన్న తక్కువ నష్టం ఉందని జాబితాలో నుంచి తీసేసింది.జిల్లాలో ముమ్మిడివరం, రామచంద్రపురం, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు మిగతా నియోజకవర్గాల్లో ఓ మాదిరి నష్టం సంభవించింది. అధికారిక ప్రాథమిక లెక్కలు ప్రకారం 73,822 మంది రైతులకు సంబంధించి పొలాలు ముంపునకు గురయ్యాయి.

ఆందోళనలో రైతులు.. పరిహారం కోసం ఎదురు చుపులు

ఖరీఫ్ తుది దశలో వచ్చిన తుపాను అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేల వాలగా, చేలల్లోని పనలు, కుప్పలు నీటిలో నాని కొన్నిచోట్ల ధాన్యం మొలకలొచ్చాయి. తుపాను వచ్చిన పదిహేను రోజుల తర్వాత పంట నష్టం అంచనాలకు వ్యవసాయ, రెవెన్యూ, పరిపాలన శాఖల నుంచి గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులతో ప్రభుత్వం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసింది. అప్పటికే వర్షాలకు తడిసిన ధాన్యం రాశులు, దెబ్బతిన్న వరి పంటను రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. నేలనంటిన పంటను కోసి కొన్నిచోట్ల మాసూళ్లు పూర్తి చేశారు. కాగా, నిబంధనల పేరిట పూర్తిస్థాయిలో అంచనాలు నమోదు చేయలేదనే ఆరోపణలొచ్చాయి. పరిహారమైనా సకాలంలో అందితే రబీ పెట్టుబడికి పనికొస్తుందని రైతులు భావించారు. రాకపోవడంతో రబీకి అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. రబీ ప్రారంభమై రోజులు దాటినా పరిహారం అందకపోవడంతో వస్తుందా రాదా అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.జిల్లాలో 1,61,139 ఎకరాల్లో వరిసాగు చేశారు. మొంథా కారణంగా 73,822,22 ఎకరాల్లో నష్టం వచ్చింది. అయితే బీమా పరిహారం 43,900 మంది రైతులకు అందింది. 30 వేల మంది రైతులకు అందలేదు.

సాగు ఖర్చులు ఎకరాకు రూ.80 వేల పైనే

ఒక ఎకరా సాగు చేసేందుకు సార్వాకు దాదాపు రూ.38,700 దాకా ఖర్చులు అవుతాయి. దాళ్వాకు రూ.10 అదనంగా ఖర్చవుతోంది. ఆకుమడి, విత్తనాలు, ఎరువులకు రూ.1500, దమ్ముకి రూ.3600, లంకల బాగుచేతకి రూ.1000, ఊడ్పులు, ఆకుతీతకు రూ.4700, కలుపుమందు చల్లినందుకు కూలి రూ.1200, కలుపుతీతకు, గడ్డికోతకి రూ.1000, ఎరువులు రెండు ధపాలకు రూ.5000, చిరు పొట్ట దశల్లో పొటాష్, గుళికలకు రూ.1200, పురుగుమందు స్ప్రేయర్లు, నాలుగుసార్లకు రూ.11 వేలు, ఎలుకల నివారణకు రూ.500, కోతమిషన్, ట్రాక్టర్‌కు రూ.6 వేలు, ధాన్యం ఆరబోత, పట్టుబడికి రూ.2 వేలతో కలిపి 38,700 అవుతుందని జిల్లా కౌలు రైతు సంఘాలు అంచనా వేశాయి. రెండు పంటలకు కలిపి మొత్తం రూ.87,400 వరకు ఖర్చులు అవుతాయని అంచనా వేశారు. ఇక కౌలు రెండు పంటలకు మెట్ట ప్రాంతంలో రూ.35 వేలు వరకు, డెల్టా ప్రాంతంలో ఇంకా ఎక్కువగా ఉంటుంది. పంట పొలాలలో దమ్ము చేసిన అనంతరం పొలాన్ని చదును చేసే ఖర్చులు కూడా పెరిగాయి. నారు వేసేందుకు, తీసేందుకు అయ్యే ఖర్చులు కూడా పెరిగాయి. ఇలా ఖర్చులు పెరుగుతున్నా వీటికి తగ్గట్టుగా పంటలకు గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉండటంతో ఆదాయం అంతంత మాత్రంగానే లభిస్తోంది. వరి కోత మిషన్‌కు గతేడాది గంటకు రూ.2300 ఉండగా ఇప్పుడు రూ.3300 చేరింది.

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు



ఇవిఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఇ విఎం)లు, వివి ప్యాట్ గోదాముల భద్రతకు పటిష్టమైన చర్యలు నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇం/తీనీరింగ్ కళాశాలలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం మూడవ అంతస్తు లో భద్రపరిచిన ఇవిఎంలు, వివిప్యాట్ గోదాములను శనివారం ఆయన ఎన్నికల సంబంధిత అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల ప్రకారం ప్రతి నెలా ఇవిఎం, వివి ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, పరిశీలించిన అంశాలను ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదికను పంపించాలని సూచించారు.అదే విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను పంపిస్తామని అన్నారు. అనంతరం అగ్నిమాపక అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, సిసి కెమెరాల దృశ్యాల పని తీరును పరిశీలించారు. ఈ తనిఖీల ప్రక్రియ కార్యక్రమంలో దొమ్మేటి రమణ కుమార్(టిడిపి), పి చిట్టీరాజు (వైసిపి), ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ శివరాజ్, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ గోపాల కృష్ణ, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉడిమూడి బ్రిడ్జి పనులు 65 శాతం పూర్తి

పి.గన్నవరం: వశిష్ట గోదావరి నదిపై ఉడిముడిలంక వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు 65 శాతం పూర్తయినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం వెల్లడించారు. ఉడిమూడి - గంటి పెదపూడి లంక గ్రామాల మధ్య ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ (ఎఐఐబి) నిధులు రూ.71.43 కోట్లుతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు క్షేత్రస్థాయిలో ఇంజినీర్లతో కలిసి పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అప్రోచ్ నిర్మాణానికి రైతుల నుంచి సేకరించిన 5.1 ఎకరాల భూసేకరణ నిధులు రూ.2.30 కోట్లు వారం రోజులలో రైతుల ఖాతాలలో జమ చేస్తామన్నారు. ఆస్ట్రేలియన్ సూపర్ టీ టెక్నాలజీతో నిర్మించడంపట్ల కలెక్టర్ సంబంధిత ఇంజినీర్ పిపి.రాజును అభినందించారు. ప్రస్తుతం 7,8 పిల్లర్స్ పనులు నదికి అడ్డంగా క్రాస్ బండ్లు వేసి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్, తహశీల్దార్ పి.శ్రీ పల్లవి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అన్యం రాంబాబు, గోదావరి హెడ్ వర్క్స్ డివిజనల్ ఇంజినీర్ ప్రసాద్, ఎఇలు దుర్గా కొండలరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్‌బిలో పాలగుమ్మి విద్యార్థినికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురంలో సూర్యనగర్ జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి ఇంగ్లీష్ స్పెల్‌బి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అమలాపురం మండలం పాలగుమ్మి జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం.యశస్వి నాగశ్రీ ప్రతిభ కనబరిచి జిల్లాలో మొదటి స్థానం సాధించిందని హెచ్‌ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి మమ్మీ, ఎఎంఒ పి. రాంబాబు, సిఎమ్‌ఒ బొరుసు సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు బి.రామకష్ణ చేతుల మీదుగా యశస్విని ప్రథమ బహుమతి అందుకుంది. జిల్లాలో స్పెల్ బి పోటీలలో ఎనిమిదవ తరగతి నుంచి జిల్లా మొదటి స్థానం సాధించిన విద్యార్థిని యశస్విని, శిక్షణిచ్చిన ఇంగ్లీషు ఉపాధ్యాయులు మోటూరి శ్రీనివాస్, తోపెల్ల రామకృష్ణలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంట్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలి



కర్టెన్ రైజర్ ఈవెంట్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరుతో నిర్వహించే సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం రాత్రి లొల్లలాకుల వద్ద ఏర్పాటుచేసిన కర్టెన్ రైజర్ ఈవెంట్ ను ఆయన ఆవిష్కరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ జనవరి 11,12,13, తేదీలలో జాతీయ స్థాయిలో పడవల పోటీలు, ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలను అధికారులు విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నియోజవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీను, డిఎస్‌పి సుంకర మురళీమోహన్, డిప్యూటీ కలెక్టర్ టిఆర్.రాజేశ్వరరావు, తహశీల్దార్ రామచం ద్రమూర్తి, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్‌రామన్, నాయకులు ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకట రాజు, మండల టిడిపి అధ్యక్షులు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న సర్పంచ్ సతీష్‌కుమారి

రైతులకు ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం


మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గల రైతులకు గ్రామ సర్పంచ్ ఎల్లమెల్లి సతీష్ కుమారి శనివారం ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ప్రతి రైతుకు దాళ్వా పంటకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రైతు సేవా కేంద్రల ద్వారా ఎరువులు బస్తాలు, యూరియా, డిఎపి వంటి అవసరమైన రకాలు రైతులకు పంపిణీ చేశారన్నారు. బయట అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయకుండా రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా రైతులను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జనార్ధన స్వామిని దర్శించుకున్న సిహెచ్‌సి సూపరింటెండెంట్

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామిని ధనుర్మాసం సందర్భంగా శనివారం సందర్భంగా ఆలమూరు సిహెచ్‌సి) సూపరిండెంట్ డాక్టర్ శివశంకర్, డాక్టర్ అనూష దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డాక్టర్‌శివశంకర్ దంపతులను సత్కరించారు.

కార్టూ'నిజం'



అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్, ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి - కాట్రేనికోన

కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి విమర్శలు చేస్తోందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్ అన్నారు. వైసిపి విమర్శలను కూటమి నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామంలో రూ. మూడున్నర కోట్లతో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముమ్మిడివరం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల ముందర ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతూ సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతున్నామనిన్నారు. రాష్ట్ర విప్ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో టిడిపి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. వైసిపి హయాంలో ప్రజలను మభ్యపెడుతూ కేవలం శంకుస్థాపనలకే పరిమితం అయ్యేవారన్నారు. మరోసారి ప్రజలను మోసగించే పనులు చేస్తున్న వైసిపి వైఖరిని ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో పది గ్రామాల్లో విద్యుత్ వెతలు తొలగనున్నాయని అన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేసిన ఎంపి, ఎంఎల్‌ఎలను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, రాష్ట్ర ఎస్‌సి మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు, రాష్ట్ర ఆక్వా బోర్డు అథారిటీ కమిటీ డైరెక్టర్ విత్తనాల బుజ్జి, పిఎస్ఎన్ రాజు, సర్పంచులు చెల్లి సురేష్, దంతులూరి కృష్ణంరాజు, ఎస్‌విఎస్ రవివర్మ, బడుగు పుల్లారావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

2 నుంచి నగరంలో భూ రీ సర్వే

ప్రజాశక్తి - మామిడికుదురు

నగరంలో జనవరి 2 నుంచి భూ -రీ సర్వే ప్రారంభం కానుందని డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య తెలిపారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జాలెం రమణ కుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో ఆమె మాట్లాడుతూ గ్రామస్త్రులో 1,672 ఎకరాలు మూడు నెలలు పాటు సర్వే నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే సరిహద్దులు గుర్తింపు పూర్తి అయిందన్నారు. రైతులు సహకరించి భూసమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాఅతీ కార్యదర్శి కె.సురేష్, ఆర్ఐ జాలెం సుబ్బారావు, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

పిఎం ఉజ్వల యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రధానిమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వెంకట సూర్య హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ అధినేత ఈదల చినబాబు, ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. శనివారం పెనికేరులో లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ స్టౌవ్, సిలిండర్, రెగ్యులేటర్, పైపు, బాండ్లను వెంకట సూర్య హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీస్ ద్వారా 16 మందికి వారు స్థానిక నాయకులతో కలిసి స్వయంగా అందజేశారు. కార్యక్రమం లో టిడిపి గ్రామ అధ్యక్షుడు గొడవర్తి సూర్య భాస్కరరావు, కూటమి నాయకులు గోపు గోపాలకృష్ణ, కొమిశెట్టి రఘు, కొమ్ము నారాయుడు, గన్ని రామన్న చౌదరి, కుడుపూడి కొండ తదితరులు పాల్గొన్నారు.



పెనికేరులో ప్రారంభిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ

ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

పెనికేరు లో ఏకీకృత కుటుంబ సర్వేను డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.వీర్రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా సచివాలయ సిబ్బంది ప్రతీ కుటుంబం యొక్క నాలుగు అంశాలపై వివరాలు నమోదు చేస్తారన్నారు. అవి ప్రాథమిక, సామాజిక, ఆర్థిక, పురోగతి వివరాలను సర్వే యాప్‌లో నమోదు చేసి భవిష్యత్తు పథకాలకు ఈ సమాచారం అందజేయనున్నారు. ఈ సర్వే వల్ల అర్హులకు ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్ల జారీ సులభతరం, పారదర్శకత పాలన అందుబాటు, ప్రోయాక్టివ్ సర్వీస్, డేటా భద్రత ఉంటుందన్నారు. సిబ్బం ది వచ్చినప్పుడు మీ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ ఒటిపి కోసం సిద్ధంగా ఉంచుకో వాలన్నారు. ఈ ఏకీకృత సర్వే ద్వారా ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వై.అయ్యన్న, వివిధ శాఖల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులు ధ్వంసం చేస్తే చర్యలు

దమ్ము చక్రాలతో జరిగే నష్టాలపై అవగాహన



నర్సిపూడి సదస్సులో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజు

ప్రజాశక్తి - ఆలమూరు

ట్రాక్టర్ల దమ్ము చక్రాలతో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లను ధ్వంసం చేస్తే ట్రాక్టర్ యజమానులపై కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ ఎ..రాజు హెచ్చరించారు. నర్సిపూడి, నవాబుపేట, పెనికేరు, కలవచర్లలలో ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ట్రాక్టర్లు దమ్ముచక్రాలతో జరిగే నష్టాలను వివరిస్తూ ట్రాక్టర్ యజమానులు, రైతులకు ప్రత్యేక అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ జి.నరేష్, ఆర్అండ్ బి డిఇ సూర్యనారాయణ, పలువురు అధికారులతో కలిసి ఆయన పాల్గొని వివరించారు. దమ్ము చక్రాలతో రోడ్లపై వెళ్లడంవల్ల ఎంతో ఖరీదైన రోడ్లు ధ్వంసమైపోతున్నాయని ఈ విషయాన్ని రైతులు, ట్రాక్టర్ యజమానులు గుర్తించి సహకరించాలని కోరారు. ట్రాక్టర్ దమ్ము చక్రాలకు పట్టీలు వేయడం ద్వారా రోడ్లు ధ్వంసం కాకుండా కొంతమేర కాపాడుకోవచ్చునని సూచించారు. ఈ విషయాలను విస్మరించి దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్డుపైకి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. తక్షణం కేసులు నమోదు చేస్తామని, ముఖ్యంగా డ్రైవర్ లైసెన్స్ రద్దు చేస్తామని, రూ.10వేల జరిమానా విధిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంసి మాజీ ఛైర్మన్ దునే స్వామి నాయుడు, సర్పంచ్ కండిబోట్ల శ్రీను, ఎంపిటిసి సభ్యుడు మేడిశెట్టి సుబ్బారావు, కార్యదర్శి దేవిశ్రీ శబరి, ప్రతినిధులు, నాయకులు, ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీల సేవలపై కళాజాతా



మామిడికుదురులో సొసైటీ సేవలను వివరిస్తూ కళాజాత

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు సెంటర్లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కాకినాడ) ఆధ్వర్యంలో సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరిస్తూ కళాజాతను శనివారం ప్రదర్శిం చారు. మొబైల్‌వ్యాన్ ద్వారా ఏర్పాటు చేసిన (కళా జాత) కార్యక్రమాన్ని నగరం పిఎసిఎస్ ఛైర్మన్ ఈలి శ్రీనివాస్ వీక్షించి సహ కార బ్యాంకు సేవలు, పిఎసిఎస్ సేవలపై రైతులకు, వ్యాపారులకు కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. పిఎసిఎస్ యొక్క లావాదేవీల ప్రక్రియ పూర్తిగా కంప్యూట రీకరణ చేయబడ్డాయని అన్నారు. దీనిని ప్రతీ ఒక్కరు తెలుసుకుని స్థానిక పిఎసిఎస్‌లో సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలు, ఆర్‌డి ఖాతాలు డిపాజిట్లు వేసి పొదుపు అలవర్చుకోవాలని అన్నారు.అలాగే రైతులు, వ్యాపారులు తక్కువ వడ్డీకే రుణాలు పొందాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ అబ్బాస్, సొసైటీ సిఇఒ అడబాల పెద్దిరాజు, డైరెక్టర్లు మట్టా సత్తి బాబు, కాకి శ్రీనివాస్, సొసైటీ సిబ్బంది, ధాన్యం కొనుగోలు స్టాఫ్, రైతులు వ్యాపారులు పాల్గొన్నారు.



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్రభుత్వం ప్రబల తీర్థాలు ప్రత్యేక పండగగా గుర్తించిన నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు అసౌకర్యం కలగకుండా పరిసరాలు పరిశు భ్రతకి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపిడిఒ బి.మమత అన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రభల తీర్థాలు నిర్వహించే మొసలపల్లి, ఇరుసుమండ, జగ్గన్నతోట ప్రాంతాలలో ప్రత్యేక శానిటేషన్ పనులను ఎంపిడిఒ బి.మమత, డిప్యూటీ సచివాలయ ఎంపిడిఒ (జిఎస్‌డబ్ల్యూఎస్) ఎండి. అబ్బాస్‌అలీలు శనివారం పరిశీలించారు. డిప్యూటీ ఎంపిడిఒ మాట్లాడుతూ సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించేలా పరిసరాల పరిశు భ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఈ సందర్శనలో ఎపిఒ పి. కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు చంటి, బాలాజీ పాల్గొన్నారు.

డిఇని ప్రభుత్వానికి సరెండర్ చేయాలి

కౌన్సిల్ సమావేశంలో 18 మంది తీర్మానం



చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపల్ డిఇశ్రీకాంత్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. గత నెల 29న జరిగిన సాధారణ సమావేశంలో డిప్యూటీ ఇంజినీర్ శ్రీకాంత్ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తూ కౌన్సిల్ సభ్యులను అవమానపరచడం, పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం, అసిస్టెంట్ ఇంజినీర్లు చేయవలసిన పనులు ఆయనే చేయడం కౌన్సిల్ సభ్యులు సూచించిన పనులను చేయకపోవడం, నియంతృత్వ ధోరణితో వ్యవహరించడంతో ఆయనను తిరిగి ప్రభుత్వనికి సరెండర్ చేయాలని తీర్మానించారు. అయితే డిఇ శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కావడంతో సభ్యులు ఆయనను తొలగించాలని వెంటనే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని నినాదాలు చేశారు. దీనిపై విప్ వాడ్రేవు సాయిప్రసాద్‌తో పాటు 18 మంది సభ్యులు డిఇని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని టేబుల్ ఎజెండా తీసుకువచ్చి తీర్మానం చేయాలని పట్టుబట్టారు. అయితే డిఇ వ్యవహారంపై ఏడుగురు సభ్యులు డీసెంట్ తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ విషయాన్ని డిసెంబర్ 17న ఉన్నతాధికారులకు తెలియజేశామని అన్నారు. ఈనెల 31న డిఇపై ఆర్‌డిఒ విచారణ నిర్వహిస్తారని సభలో వివరించారు. విచారణ పూర్తయిన తర్వాత నివేదికను పరిశీలించి ఆయనపై చర్యలు తీసుకుంటారని కమిషనర్ వివరించారు. దీనికి ముందుగా ప్రభుత్వం ఒక కమిటీని నియమిస్తుందని, అదేవిధంగా ఆయనపై ఫిర్యాదు చేసిన వారితోను వివరాలు సేకరిస్తారని కమిషనర్ సభలో వివరించారు. డిఇని తొలగించి సరెండర్ చేయాలని సభ్యులు రాతపూర్వకంగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, డీసెంట్ తెలుగు ఏడుగురు సభ్యులు మరో వినతిపత్రం కమిషనర్‌కు అందజేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలను ఆమోదించారు. అయితే వాటిలో ఆరో అంశం రద్దు చేయాలని, ఏడవ అంశం వాయిదాలని సభ్యులు సభలో కోరారు. అదేవిధంగా మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో నెలవారీ జమలు ఖర్చులు, వివరాలను సభ్యులకు తెలియజేశారు. సమావేశంలో అప్పలూరు సభ్యులు తమ వార్డుల్లో ఐదేళ్లు గడిచినా ఏ విధమైన అభివృద్ధి పనులు జరగలేదని సభలో ఆవేదన వ్యక్తం చేశారు. గత సమావేశంలో రద్దు అయిన 32 పనులను తిరిగి ఆమోదించి అమలు చేయాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

200 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి-గోకవరం

కామరాజుపేట, కొత్తపల్లి గ్రామాల్లో కోడి కత్తులు తయారు చేస్తున్న వారిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి 200 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన చేదులూరి వీరబాబు, సూరంపూడి కోటేశ్వరరావు, కామరాజుపేటకు చెందిన వేములూరి నాగేశ్వరరావును అదుపులోనికి తీసుకున్నట్టు సిఐ ఎస్‌వివిఎస్.మూర్తి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు వివిఎన్‌వి.పవన్ కుమార్, బి.నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

6 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-గోకవరం

ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సారా అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని, అతని వద్ద నుండి 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు. అతడిని రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

నీటి ప్రవాహానికి విరిగిన తలుపు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ప్రధాన పంట కాలువ నుంచి ప్రవహించే నీటి ఉధృతికి శనివారం కపిలేశ్వరపురం వద్ద కొండయ్య సర్ఫస్ నుంచి నీటిని విడుదల చేసే 4 తలుపుల్లో ఒకటి విరిగిపోయింది. ప్రధాన కాలువ నుంచి ప్రవహించే నీటిని ఉధృతిని బట్టి కపిలేశ్వరపురం వద్ద కొండయ్య డ్రెయిన్‌కు నీటిని విడుదల చేస్తారు. అయితే కంట్రోలింగ్ సిస్టం ద్వారా నీటిని విడుదల చేసే 4 తలుపులకుగాను ఒకటి పాడై విరిగిపోవడంతో నీటి ప్రవాహ ఉధృతికి మిగిలిన మూడు తలుపులను పైకి లేపి నీటిని విడుదల చేశారు. ప్రధాన పంట కాలువ ప్రవాహాన్ని కట్టడి చేశారు. అనంతరం లీకేజీని అరికట్టేందుకు ఇరిగేషన్ అధికారులు తార్పాలిన్ ఏర్పాటు చేసి సర్వేబాదులు, ఇసక బస్తాలతో ఆ ప్రాంతాన్ని పూడ్చి తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈ సమస్యల కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు గోదావరి ఈస్ట్రన్ డివిజనల్ ఇఇ, ఇరిగేషన్ కోటిపల్లి డిఇ వివి.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ రామకష్ణ, ఎల్ఎస్ఎం.సత్యవతి, ఎఇఇ కృష్ణత్రిమూర్తులు, సిబ్బంది, పాల్గొన్నారు.



రాముకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎల్ఎ ఆనందరావు

ఘనంగా సర్పంచ్ రాము పుట్టినరోజు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

గున్నేపల్లి అగ్రహారం గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు(రాము) పుట్టినరోజు వేడుక శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన సమక్షంలో కేక్ కట్ చేసి రాముకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మాచవరం సర్పంచ్ నాగబత్తుల శాంత కుమారి, నల్ల చిట్టిబాబు, ములపర్తి సత్యనారాయణ, పలివెల శ్రీను, పెద్దిరెడ్డి శ్రీరామ్మూర్తి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నాగభూషణం, సీతా రామయ్, చొల్లంగి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి రామకృష్ణ, నాగబత్తుల ఏడుకొండలు, పెద్దిరెడ్డి సూర్యచంద్రరావు, పెద్దిరెడ్డి దుర్గాప్రసాద్, ఆకుల సత్తిబాబు, అభిమానులు రాముకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

వెదిరేశ్వరంలో నెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - రావులపాలెం

. వెదిరేశ్వరంలో మాజీ వైస్ ఎంపిపి దండు సుబ్రహ్మణ్యేశ్వర వర్మ శనివారం దండు సాయి ఆకాష్ వర్మ మెమోరబుల్ టోర్నమెంట్ 10వ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నెట్ బాల్‌లో ప్రతిభ కనబరిచి దండు సాయి ఆకాష్ వర్మ అకాల మరణానికి గురయ్యారన్నారు. సాయి ఆసక్తి మేరకు ఆయన తండ్రి దండు సుబ్రహ్మణ్యేశ్వరవర్మ ఈ పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం జగ్గిరెడ్డి టాస్ వేసి ఈస్ట్ గోదావరి వర్సెస్ నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులను ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడతున్న డిప్యూటి ఎంపిడిఒ అబ్బాస్

గ్రామాల్లో యునైటెడ్ ఫ్యామిలీ సర్వే

ప్రజాశక్తి - అంబాజీపేట

ఇరుసుమండ, మొసలపల్లి గ్రామాలలో జరుగుతున్న యునైటెడ్ ఫ్యామిలీ సర్వేను శనివారం డిప్యూటీ సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒ ఎండి.అబ్బాస్ అలీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి కుటుంబం యొక్క నాలుగు అంశాలపై వివరాలు నమోదు చేస్తున్నారన్నారు. ప్రాథమిక, సామాజిక, ఆర్థిక, పురోగతి వివరాలను సర్వే యాప్ లో నమోదు చేసి భవిష్యత్తు పథకాలకు ఈ సమాచారం అందజేయనున్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు జారీ సులభతరం, పారదర్శకత పాలన, అందుబాటు ప్రోయాక్టివ్ సర్వీస్, డేటా భద్రత ఉంటుందన్నారు. సిబ్బంది వచ్చినప్పుడు ఆధార్ కార్డు, ఒటిపి కోసం మొబైల్ ఫోన్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రజల జీవన ప్రమానాల మెరుగుదలకు ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో సర్వే చేస్తున్నట్లు వివరించారు. ఈ సర్వేను నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాల సచివాలయాల విజిట్ చేశామన్నారుర. ఈ సర్వేలో సర్వర్ ఇబ్బందులు తదితర అంశాలపై పర్యవేక్షిస్తున్నామన్నారు.

కూటమి పార్టీలకు కేంద్రం చురక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి పార్టీలకు కేంద్రం చురకలు వేసిందా అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. బిజెపి సర్కారు ఉపాధి చట్టాన్ని తాజాగా రద్దు చేసిన విషయం విదితమే. ఈ స్థానంలో బివిరామ్‌జీ పథకాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెటీరియల్ కాంపోనెంట్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక శాతం అప్పజెప్పింది. రాష్ట్ర విభజన, అనంతరం జిల్లాల పునర్విభజనల నేపథ్యంలో అభివృద్ధి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కల్పించలేని దుస్థితిలో పాలన సాగుతోంది. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గడిచిన 18 నెలలో సాధించిన అభివృద్ధి మేడిపండు చందంగా మారింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలు ఉపాధి పథకంలోనే జరుగుతున్నాయి. కేంద్రం నిర్ణయంతో ప్రస్తుతం ఈ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడనుంది. మరోవైపు కరోనా నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ కాలంలో ఉపాధి పనులే గ్రామీణులకు ఆసరాగా నిలిచాయి. ఇప్పటికీ పల్లెల్లో ఉపాధి పనులు అత్యధిక మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రజల ఉపాధి కల్పనకు, అభివృద్ధి పనులకు శరాఘాతంగా మారినా ప్రశ్నించలేదని దుస్థితిలో టిడిపి, జనసేన పార్టీల నేతలు ఉన్నారనేది మరో సారి సుస్పష్టమైతంది. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకుని రాష్ట్ర ప్రయోజనాలకోసం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

కార్మికుల పండుగకు సమాయత్తం

విశాఖపట్నంలో జరగబోయే సిఐటియు అఖిలభారత మహాసభలకు ఉమ్మడి జిల్లాల నుంచి తరలి వెళ్లేందుకు కార్మికులు సమాయత్తం అవుతున్నారు. జిల్లాలో అత్యధిక మంది వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు పట్టణాలలో వివిధ వాణిజ్య, వ్యాపార రంగాలలో ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పనిగంటలలో మార్పులు తీసుకొచ్చింది. మరో వైపు స్కీము వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఇప్పటికే ఆందోళన బాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలే దిక్కుచి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో విశాఖలో జరిగే మహాసభ భవిష్యత్తు పోరాటాలకు దశ, దిశ నిర్దేశం చేస్తుందని సుస్పష్టం అవుతోంది. దీంతో వేలాదిగా తరలి వెళ్లి పాలక ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిద్ధమవుతున్నారు.

అబ్బుర పర్చిన సైన్స్ సంబరాలు

చిన్నారులలో సృజనాత్మకత వెలికితీసేందుకు నిర్వహించిన ఆవిష్కరణలు అబ్బుర పరిచాయి. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడ వేదికైంది. సత్యసాయి గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు రాజమహేంద్రవరంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. వైజ్ఞానిక



ప్రదర్శనలతో పాటు ఇతర వ్యాస రచన, ఆర్ట్ కాంపిటిషన్ లలోనూ ఆసక్తి చూపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి నిర్వహకులు వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభావేదికపై వ్యక్తల ప్రసంగాలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండటంతో పాటు శాస్త్రీత ఆలో చనలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలనే ఆకాంక్షించారు

ఎట్టకేలకు టిడిపి అధ్యక్షుల ఎంపిక

టిడిపి జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు ముగిసిన విషయం విదితమే. తాజా నిర్ణయంతో అశావహుల్లో కొంత నిరాశ వ్యక్తమైంది. పార్టీ కార్యాలయాలను నెలకొల్పేందుకు కృషి జరగాలని మంత్రి నారా లోకేష్ సూచించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న ప్పటికీ టిడిపికి సొంత కార్యాలయాలు లేవు. ప్రజాప్రతినిధుల కార్యాయాలే పార్టీ కార్యాలయాలుగా ఉన్నాయి. తాజా నిర్ణయంతో స్థలాల ఎంపిక జరగనుందని సుస్పష్టం. గత ప్రభుత్వ హయాంలో వైసిపి ప్రభుత్వ స్థలాల్లో పార్టీ కార్యాలయాలు నెలకొల్పేందుకు చేసిన ప్రయత్నం విమ ర్శలకు దారి తీసిన విషయ విదితమే. ఈ అనుభవంతో టిడిపి ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.



ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరించి పుష్పగుచ్ఛం అందిస్తున్న మీనా

ఎంఎల్ఎ వేగుళ్లను కలిసిన మీనా

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం, మండపేట

టిడిపి అమలాపురం పార్లమెంట్ మెయిన్ కమిటీ కార్యదర్శిగా నియమితులైన పిల్లి మీనా శనివారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో పార్లమెంట్ కమిటీ లో కార్యదర్శిగా నియమించినందుకు ఎంఎల్ఎ వేగుళ్లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండపేట మండల మాజీ అధ్యక్షులు యరగతపు బాబ్జి, ద్వారపూడి గ్రామశాఖ అధ్యక్షులు సత్తి సత్యనారాయణ, జెడ్.మేడపాడు సొసైటి ఛైర్మన్ సలాది బాలసుబ్రహ్మణ్యం, చింతా దొరబాబు, వర్రె వీరబాబు, కొవ్వల రాజు, దాట్ల కృష్ణంరాజు, సత్తింశెట్టి అయ్యప్ప పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ఇటీవల పలువురు మరణించారు. వారి కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఈ పరామర్శల్లో నూని వీర్రాజు, రిమ్మలపూడి రామక ష?, వానపల్లి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, చుండ్రు రాజు, దేవు శ్రీను ఉన్నారు.

విద్యార్థులకు డిఇఒ అభినందన

ప్రజాశక్తి - అమలాపురం

విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శనలో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఫుట్ ప్రెస్ పవర్ జనరేటర్ రాష్ట్ర స్థాయిలో ఎంపికైందని హెచ్ఎం కె.ఘన సత్యనారాయణ తెలిపారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిఇఒ పి.నాగేశ్వరరావు విద్యార్థులు ఎన్.సత్య ప్రవీణ్, పి.సిద్దార్ధలకు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో శనివారం హెచ్ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను, గైడ్ టీచర్స్ పివిఎల్ఎన్.శ్రీరామ్, ఎంఎస్‌డి భవాని, ఉపాధ్యాయులు బి ఎన్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ప్రసాద్, వర్మ, శ్రీనివాస్, గోపాలకృష్ణ, సత్యనారాయణ, చంద్రమోహన్. కర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గున్నారు.

దాతల సహకారంతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రహదారి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామానికి దాతల ఆర్థిక సాయంతో రహదారి నిర్మించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక 12 వార్డు ప్రాంతమైన మల్లయ్య పాలెం గ్రామానికి వెళ్ళేందుకు సరైన రహదారి లేక పైకోడు మెరక, ఉందుర్తి వారి పేటకు రాకపోకలు సాగించాలంటే అష్టకష్టాలు పడుతున్న సమస్యను గ్రామస్తులు బంకు రాము, రెడ్డి అబ్బులు దృష్టికి తీసుకువచ్చారు. వీరిద్దరూ స్పందించి రహదారి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేశారు. దీనితో హుటాహుటిన గ్రావెల్ రోడ్డును నిర్మించారు. ప్రజల అవసరాన్ని గుర్తించి రాకపోకలు సాగించెందుకు సహకరించిన దాతలకు శనివారం గ్రామానికి చెందిన యల్లమిల్లి వెంక టేశ్వరావు, గెడ్డం శ్రీనివాసరావు, దొంగ గంగాధర్, జంగా మణికంం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

వాడపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి 2026 వార్షిక క్యాలెండర్‌ను ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు శనివారం ఆవిష్కరించారు. సోమవారం జరగనున్న ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకార ఏర్పాట్లను ఎంఎల్ఎ పరిశీలించారు. అనంతరం స్వామివారిని దర్శించుకునిపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొనడం సంతోషదాయకమని ఎంఎల్ఎ అన్నారు. .

కలెక్టరేట్‌లో 'క్రిస్మస్ ఈవ్ హైటి'

ప్రజాశక్తి అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఈవ్ హైటి ప్రోగ్రామ్‌ను శనివారం క్రైస్తవ మత పెద్దలతో జిల్లా యంత్రాంగం నిర్వహించింది. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా అందరికీ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆనందరావు, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సునీల్ వికాస జిల్లా మేనేజర్ రమేష్ మత పెద్దలు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

దాతల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కార్తీకమాసంలో యాత్రికుల అన్నదానం కోసం సహకరించిన దాతల సేవలు మరువ లేనివని ఎంపీ గంటి హరీష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. శనివారం కార్తీకమాసంలో సహకరించిన దాతలకు మండల పరిధిలోని కొండలేశ్వరం శివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ హరీష్, ఎంఎల్ఎ సుబ్బరాజు పాల్గొని దాతలు అందర్నీ దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, పిఎస్ఎన్.రాజు, గంగుమళ్ల భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జిగా డాన్ సూరి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎమ్ఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జిగా డాన్ సూరి నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. సూరికి ఎమ్ఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్ అనుబంధ సంఘాలనాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

11 నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వచ్చే నెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహించే సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆత్రేయపురంలో ముదునూరి వెంకటరాజు స్వగృహంలో శనివారం జరిగిన టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఆత్రేయపురం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. బొబ్బర్లంక - వద్దిపర్రు రహదారి పనులు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని టెంపుల్ టూరిజంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. వచ్చే నెలలో డ్రాగన్ పడవ పోటీలు, ఈత పోటీలు, లొల్ల లాకుల వద్ద ఫుడ్‌ఫెస్టివల్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. లొల్ల లాకుల పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రహదారులు డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ ఐక్యమత్యంతో కల్సి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, ముళ్ళపూడి భాస్కరరావు,నాగిరెడ్డి సత్యనారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సర్పంచ్ బాలరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - అంబాజీపేట



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఆధ్వర్యంలో శనివారం పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లియ్య సర్పంచ్‌కు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉప సర్పంచ్ వీరా రవి, మాజీ ఎంపిటిసి సభ్యుడు నూకపెయ్యి సత్యనారాయణ, వర్మ, గంటి చిరంజీవి, బొట్టు బంగారం కార్యక్రమంలో పాల్గొని సర్పంచ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.1 లక్ష విరాళం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి విశాఖపట్నానికి చెందిన కవికొండల వెంకట్రావు పేరుమీద ఆయన సతీమణి కవికొండల అప్పలనర్సమ్మ రూ. 1 లక్ష ఆలయ సహాయ కమిషనర్, ఇఒ అల్లు వెంకట దుర్గా భవానీకి విరాళంగా అందజేశారు. దాతకు భీమేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

అప్పనపల్లిలో రూ.10 వేల విరాళం

మామిడికుదురు: రాజమండ్రికి చెందిన మల్లిన ఆకాష్‌చౌదరి, వికాస్ చౌదరి, వారి కుటుంబ సభ్యులు అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని శనివారం దర్శించి, స్వామివారి అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, శ్రీ స్వామివారి చిత్రపటం అందజేశారు.

పాఠశాల అభివృద్ధికి హామీ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

కలవచర్లలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మీటింగ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేడవరపు భద్రం దొరను శనివారం ఉపాధ్యాయులు ఆహ్వానించారు. సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. భద్రం దొర మాట్లాడుతూ స్కూల్‌కి ఘన చరిత్ర ఉందని తెలిపారు. స్కూల్‌కు ప్రింటర్ సమకూరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిద్దె మీనాక్షి దంపతులు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాట్రేనికోన

షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకిల్లు దగ్ధమైంది. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని సత్తెమ్మ చెట్టు గ్రామంలో శనివారం సాయంత్రం జగడంనాని బాబుకు చెందిన తాటాకిల్లు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటల్లో కాలిపోయింది. దీంతో హుటాహుటీన సంఘటనా స్థలానికి ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షలు విలువ చేసే గృహ ఉపకరణాలు కాలి బూడిదయ్యాయి.

వాడపల్లిలో కారు బీభత్సం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి పార్కింగ్ ప్రదేశంలో శనివారం కారు బీభత్సం సృష్టించింది. దీంతో మూడు కారులు పాక్షింగా దెబ్బతిన్నాయి. వివరాలు ఇవి.. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచి తన కారును యజమాని న్యూ పార్కింగ్లో పెట్టారు. కారు మొరాయించడంతో మెకానిక్ రిపేర్ చేసేందుకు వచ్చాడు. ఈ తరుణంలో కారు యజమాని కారును స్టార్ట్ చేసి ఇంజన్ చెక్ చేస్తున్నాడు. ఈ సమయంలో ఒక్కసారిగా కారు ముందుకు దూసుకుపోవడంతో మూడు కార్లు దెబ్బ తిన్నాయి. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో నాలుగు కార్లకు నష్టం వాటిల్లింది.

29న 'ఉపాధి'పై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఉపాధి హామీ చట్టంలో 24-25లో జరిగిన పనులకు సంబంధించి ఈనెల 29వ తేదీ నుంచి జరిగే సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. దీనిపై శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బికెఎస్-ఎస్. వెంకటరామన్ అధ్యక్షతన సామాజిక తనిఖీ బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం అదనపు కార్యక్రమ అధికారి సిహెచ్.విజయరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కాకినాడలో విలీనం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గం కాకినాడ జిల్లాలో కొనసాగించాలని అఖిలపక్ష ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్‌డిఒ, ఇతర డివిజన్ కార్యాలయాలు రామచంద్రపురం అనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అఖిల పక్ష జెఎసి కన్వీనర్ మాగాపు అమ్మి రాజు, కో- కన్వీనర్, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, జిల్లా ఎఐకెఎంఎస్ నాయకులు వెంటపల్లి భీమశంకరం, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, బిఎస్‌పి కాకినాడ జిల్లా అధ్యక్షులు మాతా సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కలపడం పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్యగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష జెఎసి గౌరవ అధ్యక్షులు దొమ్మలపాటి సత్యనారాయణ, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, పివైఎల్ నాయకులు నాగరాజు, రైతు కూలీ సంఘం నాయకులు చెల్లె లక్ష్మి, మల్లిడి జార్జి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆలమూరు

ఖమ్మంలో జనవరి 18 న 5 లక్షల మందితో సిపిఐ శత వసంతాల వార్సికోత్సవ ముగింపు సభ ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆలమూరు బస్టాండ్ లో గల అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ మండల కార్యదర్శి యేసురాజు చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌టియు కార్యాలయం వద్దకు చేరుకొని బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సిపిఐ కొత్తపేట నియోజకవర్గం కార్యదర్శి కె.రామకృష్ణ వందన సమర్పణ చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరు ఆర్‌సిఎం చర్చిలో శనివారం పాస్టర్ పినిపే జయరాజ్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయెల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్న వరాజు తదితరులు పాల్గొని క్రిస్మస్ కేకును కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లు యర్రంశెట్టి రామచంద్ర రావు, గెడ్డం స్వరూప రాణి, మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్ బాబు, వైసిపి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు, నాయకులు మోటూరి సత్యం కాపు,యనమదల పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - కాట్రేనికోన.

చెయ్యేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ప్రపంచ వికలాంగ దినోత్సవ సంబరాలు ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో వికలాంగులు రాణిస్తున్న తరుణంలో ప్రభుత్వం వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ వికలాంగులకు అన్నివిధాల అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో భవిత పిల్లలకు అవసరమైన సామగ్రిని టిడిపి రాష్ట్ర నాయకులు నడింపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో దాతలు ఔదార్యంతో నిధులు సమకూర్చారు. కార్యక్రమంలో ఎస్‌సి మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, దాట్ల పవన్, పిఎస్ఎన్ రాజు, త్సవటపల్లి నాగు, త్సవటపల్లి శ్రీనివాస్, తెలుగు యువత మండల అధ్యక్షులు వంగ దుర్గబాబు ఉన్నారు.

2 నుంచి క్షేత్రస్థాయి రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో భూముల రీ-సర్వే ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తహశీల్దారు అంకం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి ములకల్లంక, రఘుదేవపురం గ్రామాల్లో ఈ సర్వే పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహించనున్నారు. ములకల్లంకలో డిసెంబర్ 29న ఉదయం 10 గంటలకు, రఘుదేవపురంలో డిసెంబర్ 30న గ్రామ సభలు నిర్వహిస్తామని తహశీల్దారు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులందరూ తమ వద్ద ఉన్న భూమికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులు, ధ్రువపత్రాలతో ఈ గ్రామ సభలకు హాజరుకావాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.